REGD NO : APTEL 16144

# జన స్వరం
పవర్
అక్షరమే ఆయుధం

www.janaswaram.com



జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :
janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 326 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 09-06-2025 | పేజీలు : 6

## విషం చిమ్మడంలో గట్టు దాటారు

- నీచ సంస్కృతికి చెక్ పెడతాం: సీఎం చంద్రబాబు
- మన తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు క్షమించరాని నేరం
- మహిళల పోరాటాన్ని మనసులో పెట్టుకుని నీచంగా మాట్లాడారు
- రాజధానిపై విషం చిమ్మడంలో గట్టు దాటారు: చంద్రబాబు



**అమరావతి, జూన్ 8 (జనస్వరం) :** మీడియా విశ్లేషణల పేరుతో రాజధాని అమరావతి మహిళలపై దారుణ వ్యాఖ్యలు చేయడాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టుదాటి ప్రవర్తించారని, మన తల్లులు, చెల్లెళ్లపై ఇలాంటి దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. 'ఆడబిడ్డలను గౌరవించే సంస్కృతి మనది. రాజకీయ కక్షతో, మీడియా విశ్లేషణల పేరుతో నిస్సిగ్గుగా మన తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం. రాజధాని ప్రాంత మహిళల వ్యక్తిత్వాలను అవమానించేలా వేశ్యలు అంటూ చేసిన దారుణ వ్యాఖ్యలను ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఇటువంటి వికృత పోకడలను తీవ్రంగా ఖండిస్తున్నా. తన సొంత మీడియా ద్వారా జరిగిన ఈ దారుణాన్ని మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఇప్పటికీ ఖండించకపోవడం, స్త్రీ జాతికి క్షమాపణ చెప్పకపోవడం మరింత విచారకరం. రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టుదాటి మహిళల మనోభావాలను గాయపరచినవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళలను గౌరవించి, వారి ఆత్మగౌరవానికి అండగా నిలిచే కూటమి ప్రభుత్వం ఈ నీచ సంస్కృతికి చెక్ పెట్టే బాధ్యత తీసుకుంటుంది' అని చంద్రబాబు ట్వీట్ చేశారు.

## ఆ వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృత కుట్ర: పవన్

- కఠిన చర్యలు తథ్యం: డిప్యూటీ సీఎం పవన్
- పోలీసులు చట్ట ప్రకారం ముందుకెళ్తారు
- అమరావతిపై దుష్ప్రచారమే ఆ ముఠా ఉద్దేశం



**అమరావతి, జూన్ 8 (జనస్వరం) :** 'రా జధాని అమరావతిపై కుల ముద్రలు వేసి, మహిళలను అవమానిస్తారా..? ఇక్కడ వెలసిల్లిన బౌద్ధాన్నీ అవహేళన చేస్తారా..?' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మండిపడ్డారు. అమరావతి మహిళలపై జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాజధానిపై కుట్రలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 'రాజధాని అమరావతి ప్రాంతంపై ఒక చానల్‌లో జర్నలిస్టు ముసుగులో ఒక వ్యక్తిచేసిన దారుణ వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృతమైన కుట్ర దాగి ఉంది. వైసీపీ టీవీ చానల్ ద్వారా రాజధాని అమరావతి వేశ్యల రాజధాని అని కామెంట్ చేయించారు. దారుణ వ్యాఖ్యలతో మహిళలను అవమానించారు. అంటే.. ఇక్కడ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, రెడ్డి, కమ్మ, కాపు, ఇతర సామాజిక వర్గాల మహిళలందరినీ అవమానించడమే కదా..' అని పవన్ ప్రశ్నించారు. ఆ వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని.. అది సదరు వ్యక్తి అభిప్రాయం మాత్రమేనని ఆ చానల్ కూడా తప్పించుకోలేదన్నారు. వాటిని ప్రసారం చేయడమే కాకుండా.. చర్చ సందర్భంగా కనీసం ఖండించి, తప్పుబట్టలేదన్నారు. ఇలాంటి కుట్రలు, దుష్ప్రచారం చేసిన వ్యక్తులపైనా, వారి వెనుక ఉన్న వారిపైనా రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. నీచ వ్యాఖ్యలు చేసిన వారిపై పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.

# మంత్రి లోకేశ్ పర్యటనకు సర్వం సిద్ధం

- పార్వతీపురంలో విద్యార్థులతో ముఖాముఖి
- టెన్త్, ఇంటర్ ఫలితాల్లో మెరిసిన వారికి పురస్కారాల ప్రదానం
- చినబొండపల్లిలో క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



**పార్వతీపురం, జూన్ 8 (జనస్వరం) :** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సోమవారం జిల్లాకు రానున్నారు. జిల్లాకేంద్రం పార్వతీపురంలో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా మంత్రి లోకేశ్ జిల్లాకు వస్తుండడంతో ఘన స్వాగతం పలికేందుకు శ్రేణులు సర్వం సిద్ధం చేశారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా మూడోసారి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లోనూ ముందంజలోనే ఉంది. ఈ నేపథ్యంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' పేరిట మంత్రి పురస్కారాలు అందించనున్నారు. మన్యం జిల్లా నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకోసం పార్వతీపురంలోని రాయల్ కన్వెన్షన్ హాల్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యార్థులతో మంత్రి ముఖాముఖి నిర్వహిస్తారు. ఆ తర్వాత పార్వతీపురం మండలం చినబొండపల్లిలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించ నున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు గ్రామ కమిటీలు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, కుటుంబ సాధికారిక సభ్యులతో మాట్లాడనున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ఏడాది పాలనలో సాధించిన ఫలితాలు , అభివృద్ధి కార్యక్రమాలు, వాటిని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, భవిష్యత్‌లో ఏ ఎన్నికలు జరిగినా.. ఎలా సమాయత్తం అవ్వాలనే దానిపై మంత్రి చర్చిస్తారని సమాచారం. సాధారణ ఎన్నికల్లో కష్టపడి పార్టీను ముందుకు నడిపించిన ముఖ్య కార్యకర్తలకు లోకేశ్ చేతుల మీదుగా సత్కరించనున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొనున్నారు.

**ఘన స్వాగతానికి సన్నాహాలు :**
సీతానగరం మండలం లచ్చయ్యపేట వద్ద మంత్రి లోకేశ్‌కు మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణలు ఘన స్వాగతం పలకనున్నారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరుకానున్నారు.


**122 మంది 'షైనింగ్ స్టార్స్' :**
జిల్లాలో 122 మంది విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్ ' పేరిట మంత్రి లోకేశ్ పురస్కారాలతో పాటు నగద కూడా అందించనున్నారు. టెన్త్‌లో 96 మంది, ఇంటర్‌లో 26 మంది విద్యార్థులున్నారు.

**ఇన్నోవేటివ్ హబ్‌కు శంకుస్థాపన :**
పార్వతీపురం పట్టణంలో నిర్మించనున్న ఇన్నోవేటివ్ హబ్‌కు మంత్రి నారా లోకేశ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. షైనింగ్ స్టార్స్ కార్యక్రమం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారని వెల్లడించారు. నీతి అయోగ్ అందించిన రూ.3 కోట్లతో దానిని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

**భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ :**
మంత్రి నారా లోకేశ్ జిల్లా పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 370 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారిని ఎనిమిది సెక్టార్లుగా విభజించామన్నారు. ఏఎస్పీ అంకితసురాన పర్యవేక్షిస్తారని వెల్లడించారు. ఆయన వెంట పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఏఆర్ డీఎస్పీ ధామన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**టూర్ షెడ్యూల్ ఇదీ.. :**
మంత్రి నారా లోకేశ్ సోమవారం ఉదయం 8.40 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి రోడ్డు మార్గం ద్వారా పార్వతీపురం రాయల్ కన్వెన్షన్ హాల్‌కు చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఉంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు పార్వతీపురం మండలం చినబొండపల్లి సభా వేదిక వద్దకు చేరుకుంటారు. రాత్రి ఏడు గంటల వరకు పార్టీ శ్రేణులతో మంత్రి సమావేశం కానున్నారు. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి రోడ్డు మార్గం గుండా విశాఖపట్నం పార్టీ ఆఫీస్‌కు చేరుకుంటారు. ఇదిలా ఉండగా పార్వతీపురంలో ప్రత్యామ్నాయంగా హెలీప్యాడ్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 08 జూన్ 2025,
తిథి : శుద్ధ ద్వాదశి (ఉ.07:22 వ.కు),
నక్షత్రం : స్వాతి (మ.12:43వ.కు),
బ్రహ్మ ముహూర్తం : తె.04:01ల తె.04:49,
రాహుకాలం : సా.04:58ల సా.06:36,
యమగండం : మ.12:07ల మ.01:44,
వర్జ్యకాలం : రా.07:01 రా.09:01

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 08 జూన్ 2025,
ఫజర్ : తెల్లవారుజామున గం. 04:30
సూర్యోదయం : ఉదయం గం. 05:49
జొహర్ : మధ్యాహ్నం గం. 12:19
అసర్ : సాయంత్రం గం. 03:44
మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:48
ఇష : రాత్రి గం. 08:08




జన స్వరం
**విలేకరులు కావలెను**
"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# అమరావతిపై దుర్భాషల దాడి.. జగన్ దిగజారుడుతనానికి ప్రత్యక్ష నిదర్శనం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తుఫానులను మించిన అలజడి రేపిన ఘోటన.. మహిళల గౌరవాన్ని తాకట్టు పెట్టే విధంగా, అమరావతిపై విమర్శల పేరిట వస్తున్న అభ్యంతరకర వ్యాఖ్యలు యావత్తు సమాజాన్ని కలచివేసే విధంగా ఉన్నాయి. ముఖ్యంగా ఓ టీవీ చానల్ చర్చా కార్యక్రమంలో "అమరావతి దేవతల రాజధాని కాదు, వేశ్యల రాజధాని" అనే వ్యాఖ్యలు వెలువడిన తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ స్పందన ముఖ్యంగా గుర్తించదగ్గది. అమరావతి మహిళలపై చేసిన అసభ్య వ్యాఖ్యల పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, "ఇది జగన్ రెడ్డి తనదైన దిగజారుడు రాజకీయ శైలికి నిదర్శనం" అంటూ ధ్వజమెత్తారు. సాక్షి మీడియా వేదికగా అమరావతిపై వ్యతిరేకతను వ్యక్తం చేయడం జగన్ కుట్రాత్మక రాజకీయ లక్ష్యాలకే సంకేతమని స్పష్టం చేశారు.

అమరావతిని 'దేవతల రాజధాని'గా కొనియాడిన లోకేష్.. "మహిళలను అవమానించే వారు చరిత్రలో కలిసిపోతారు. కాలం వారిని క్షమించదు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "అమరావతి శాంతమూర్తుల పుణ్యభూమి, అక్కడ భూములు త్యాగం చేసిన తల్లుల త్యాగానికి ఇది అవమానం" అని తెలిపారు. "జగన్ అనే సైతానును తరిమికొట్టిన పవిత్ర భూమి అమరావతి" అని ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం.

ఇదంతా సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వ తీరుకు పూర్తిగా విరుద్ధంగా ఉంది. మహిళల గౌరవం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడనని, మహిళలను అవమానించే వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని లోకేష్ తేల్చి చెప్పారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నడూ మహిళల జోలికి వచ్చినవారిని సహించరు. వారు చెప్పిన మాటే చివరి మాట అవుతుంది" అని గుర్తు చేశారు.



ఈ విషయంలో అత్యంత బాధాకరం, ఆందోళనకరం అయినది – అధికార పార్టీ వేదికగా మహిళలను కించపరిచే ప్రయత్నం జరగడం. ఇది రాజకీయ విభేదాలను అధిగమించి, మానవతా విలువలకే అవమానం. మహిళల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే వ్యాఖ్యలు సృష్టించే దుష్పరిణామాల పట్ల సమాజం అప్రమత్తంగా ఉండాలి.

లోకేష్ విజ్ఞప్తి – "జగన్ రెడ్డి తక్షణమే బేషరతుగా రాష్ట్ర మహిళలకు క్షమాపణ చెప్పాలి. వీరి బృందం మహిళల మీద విషప్రచారం చేస్తుంటే, వారిని క్షమించరాదు. న్యాయపరంగా సరైన చర్యలు తీసుకోవాలి.

## ఎడిటోరియల్

మహిళల గౌరవం రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది" అన్నది పూర్తిగా సమర్థనీయం.

జగన్ రాజకీయాలు ఇప్పుడు నైతికంగా, విలువల పరంగా పూర్తిగా దిగజారిన దశలో ఉన్నాయి. "రాష్ట్రం మందులు లేని మహమ్మారితో బాధపడుతోంది – అది జగన్ రాజకీయ వ్యాధి" అన్న లోకేష్ వ్యాఖ్య రాజకీయ శైలిపై ప్రతిబింబాన్ని చూపుతోంది.

సాక్షి వేదికగా ఆవేశంతో తూచ్‌తూలకుండా మాట్లాడిన వ్యక్తి మాటల వెనుక దాగి ఉన్న కుట్రాత్మక ప్రయోజనాలు బయటపడాలి. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిని న్యాయబద్ధంగా శిక్షించాలి.

రాజకీయ వ్యత్యాసాలు ఉంటే ఉండొచ్చు. కానీ మహిళల గౌరవంపై దాడి చేయడమంటే మన సంస్కృతిని నాశనం చేయడమే.

**ఇది మరిచిపోలేని ఘట్టం కావాలి – న్యాయబద్ధ పరిష్కారం అందాల్సిన ఘట్టం కావాలి**



**జమ్ము సాయి కల్యాణ్,**
**పొలిటికల్ అనలిస్టు,**
**మేనేజింగ్ డైరెక్టర్,**
**జనస్వరం మీడియా.**

## ముగిసిన భాగవత పఠనం



**పులివెందుల జూన్ 8 (జనస్వరం) :** నియోజకవర్గంలోని లింగాల మండలం అంబకపల్లె గ్రామంలో వెలసిన అవధూత ఆవుల స్వామి ఆలయంలో వారం రోజులపాటు నిర్వహించిన భాగవత పట్టణం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా మంత్రపుష్పం ఆలయ చుట్టూ కలశ ప్రదర్శన నిర్వహించారు. పులివెందుల భాగవత సమాజం దాతల ఆధ్వర్యంలో నిర్వహించిన చివరి రోజు కార్యక్రమంలో భాగవత పండితులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి భాగవత సమాజం అభినందనలు తెలిపింది.

## అమరావతి రాజధాని విషయంలో.. మహిళలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలపై నిరసన

- కదం తొక్కిన తెలుగు మహిళలు
- పాలకొల్లు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



**పాలకొల్లు, జూన్ 8 (జనస్వరం) :** అమరావతి రాజధాని, మహిళలపై కించపరిచే విధంగా సాక్షి ఛానల్‌లో, ఓ కార్యక్రమంలో వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద టీడీపీ మహిళలు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మహిళలకు జగన్మోహన్ రెడ్డి, ఆయన సతీమణి భారతిరెడ్డిలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ పాలకొల్లు పట్టణ ఎస్సై జి పృద్వికు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళలంతా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జగన్, అతని సతీమణి భారతి రెడ్డిలు క్షమాపణ చెప్పాలని, అసభ్యకరంగా మాట్లాడిన జర్నలిస్ట్ కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్ రావులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నినదించారు. క్షమాపణ చెప్పే వరకు మా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సాక్షి ఛానల్, సాక్షి పత్రికను ప్రతి ఒక్కరూ బహిష్కరించాలని కోరారు. అమరావతి రాజధానిపై జగన్ ముఠా కావాలనే విషం కక్కుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకులు పెండ్యాల భవాని, ఎస్తేరు రాణి, బేతు నాగలక్ష్మి, దేవగానుగుల వరలక్ష్మి, సంఘూల విజయలక్ష్మి, తాళం అన్నపూర్ణ, తాళ్లూరి విజయలక్ష్మి యర్రంశెట్టి దుర్గాభవాని, గుబ్బల రామలక్ష్మి మల్లుల అమృతవల్లి, పాల నాగలక్ష్మి దొమ్మేటి పార్వతి డబ్బా ఎస్తేరు రాణి పులి మాధురి తదితరులు పాల్గొన్నారు.

## హస్తకళల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌కు సన్మానం




**తిరుపతి, జూన్ 8 (జనస్వరం) :** రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన తిరుపతికి చెందిన "బోత్ హాస్పిటల్స్" అధినేత డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌కు ఆదివారం కూటమి పార్టీల నాయకులు సన్మానం నిర్వహించారు. ఈమేరకు హరిప్రసాద్ నివాసంలో నాయకులు కలిసి శాలువలతో సత్కరించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, తిరుపతి టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు, సుబ్బు యాదవ్, సుధాకర్ రెడ్డి, దేవాచారి, రవితేజ నాయుడు, ధనంజయ, రవి, హేమంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివి కృష్ణం రాజుపై కఠిన చర్యలు తీసుకోవాలి

**సర్పంచ్ కరేటి అమరావతి**



**కోవూరు, జూన్ 8 (జనస్వరం) :** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశానుసారం అమరా వతి మహిళలపై అసభ్య పదజాలంతో సాక్షి టీవీ ఛానల్‌లో మాట్లాడిన వివి ఆర్ కృష్ణంరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల మహిళలు అందరూ తీవ్రంగా ఖండిస్తూ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని సర్పంచ్ కరేటి అమరావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఇంతా మల్లారెడ్డి, మండల అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు కార్యకర్తలు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# అందని ద్రాక్షలా అరటి రైతుల పరిహారం

- నాలుగు విడతలుగా పెనుగాలుల విధ్వంసం
- 1042 హెక్టార్లలో పంట నష్టం
- 1355 మంది రైతులు గుర్తింపు
- నెలలోపు అందజేస్తామంటూ నాడు చంద్రబాబు ప్రకటన
- రెండు నెలలకు పైబడి కావస్తున్న పైసా విదిల్చని ప్రభుత్వం



**పులివెందుల, జూన్ 8 (జనస్వరం) :** ఈ ఏడాది వేసవిలో పులివెందుల ప్రాంతంలో మొత్తం నాలుగు విడతలుగా పెనుగాలులు విధ్వంసాన్ని సృష్టించాయి. ఈ ప్రకృతి వైపరీత్యాలకు మొత్తం 1042 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. నష్టపోయిన రైతులలో 1355 మంది రైతులు పరిహారానికి అర్హులుగా ఉద్యాన శాఖ గుర్తించింది ఆ మేరకు నివేదికలను కూడా ప్రభుత్వానికి ఉద్యాన శాఖ అందజేసింది. పంట నష్టం జరిగిన సమయంలో నెలలోపు రైతులకు పరిహారం అందజేస్తామని, హెక్టారుకు రూ.30వేల చొప్పున అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. నెల కాదు కదా సుమారు రెండున్నర నెల కావస్తున్నా ప్రభుత్వం పైసా విదిల్చలేదు. దీంతో ఉద్యాన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది మార్చి 23వ తేదీన పెనుగాలులు సంభవించాయి. అప్పట్లో 567.99 హెక్టార్లలో అరటి తోటలు దెబ్బతిన్నాయి. అలాగే రెండో విడత ఏప్రిల్ 14న మరోసారి ఈదులు గాలులు సంభవించాయి. ఇందులో 246.13 హెక్టార్లలో 332 మంది రైతుల పంటలు దెబ్బతిన్నాయి. ఇక మూడో విడుదల అదే నెల 18న 156.76 హెక్టార్లలో 252 మంది రైతుల పంటలు దెబ్బతిన్నాయి. ఇక నాలుగో విడత గత నెల 12న 71.63 హెక్టార్లలో 102 మంది రైతులు పంటల దిగుబడి కోల్పోయారు. ఆ మేరకు పంట నష్ట నివేదికలను ప్రభుత్వానికి పంపినట్లు ఉద్యాన శాఖ అధికారులు వెల్లడించారు. పంట నష్టం జరిగిన సమయంలో ఒక్క కాంగ్రెస్ పార్టీ మినహా అధికార, ప్రతిపక్ష నాయకులు దెబ్బతిన్న పంటలను సందర్శించి రైతులను పరామర్శించారు. ఈ పరిణామ క్రమంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, పులివెందుల అసెంబ్లీ టీడీపీ ఇన్చార్జ్ బీటెక్ రవి మరి కొంతమంది అధికార పార్టీ నాయకులు సందర్శించారు, అదే సమయంలో మంత్రి అచ్చెనాయుడు కూడా స్పందించి నెలలోపు పరిహారం అందజేస్తామని బాధిత రైతులకు ఫోన్ ద్వారా హామీనిచ్చారు. కానీ ఇంతవరకు పైసా కూడా ప్రభుత్వం ఆర్థిక సాయం అందించలేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల 28న కడప నగరంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో కూడా అరటి రైతుల పరిస్థితి ఉసెత్తలేదు. పరిహారం ఎప్పుడు వస్తుందన్న అంశంపై కూడా స్పష్టత లేదు. పెనుగాలుల విధ్వంసానికి ఎక్కువగా 80 నుంచి 90 శాతం వరకు అరటి రైతులు దెబ్బ తిన్నారు. మిగిలిన 10 శాతం మంది రైతులు వివిధ పంటలను కోల్పోయారు. మరి పరిహారం ఎప్పుడు ఇస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇకపోతే ఖరీఫ్ సీజన్ రానే వచ్చింది. అదును పదును కూడా కలిసి వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఏరువాక సేద్యను పూర్తవుగానే వివిధ రకాల పంటలు సాగుకు ఉపక్రమించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న రైతుల వద్ద చిల్లి గవ్వ కూడా లేని పరిస్థితి. ఈ సమయంలో వారికి పరిహారం అందిస్తే కాస్త ఊరట కలుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న రైతులకు పరిహారం అందించడంతోపాటు ప్రత్యామ్నాయ వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది.

## 48 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


- నలుగురు స్మగ్లర్లు అరెస్టు
- ఒక మోటారు సైకిల్ స్వాధీనం



**తిరుపతి, జూన్ 8 (జనస్వరం) :** అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి అటవీప్రాంతంలో 48 ఎర్రచందనం దుంగలతో పాటు ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, నలుగురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆదేశాలతో డీఎస్పీ జి.బాలిరెడ్డి మార్గ నిర్దేశకత్వంలో ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ మురళీధరరెడ్డి టీమ్ శనివారం రాత్రి అన్నమయ్య జిల్లా బురకాయల కోట అటవీ ప్రాంతం చేరుకుని, స్థానిక అటవీ అధికారులు జయప్రసాదరావు, మోహన్ రెడ్డి, షబీన్ తాజ్‌ల సహకారంతో వేపూరి కోట ఫారెస్ట్ బీటు పరిధిలో డంపింగ్ పాయింట్ల తనిఖీ చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున వీరికి అన్నగారిపల్లి సమీపంలోని వంకగట్టు వద్ద ఒక మోటారు సైకిల్ కనిపించింది. దానిని సమీపించడంతో అప్పటికే అక్కడ గుమికూడి ఉన్న కొందరు పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. ఆప్రాంతంలో తనిఖీ చేయగా అక్కడ 48 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని అన్నమయ్య జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. వారితో పాటు ఎర్రచందనం దుంగలు, మోటారు సైకిల్‌ను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జర్నలిస్టుల క్రీడా పోటీలకు సహకరిస్తా

**ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి**



**పులివెందుల జూన్ 8 (జనస్వరం) :** రాష్ట్రస్థాయిలో జరిగే జర్నలిస్టుల క్రీడా పోటీలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో ఆదివారం రాష్ట్ర జర్నలిస్ట్ టోర్నీ విజేత కడప టీంను ఆయన అభినందించారు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో కడప జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన టోర్నమెంట్ విజేతలను ప్రశంసించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి జర్నలిస్టు క్రీడా పోటీలకు తాను పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. క్రీడారంగం పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ రామసుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రభంజన్ రెడ్డి, టీం సభ్యులు శేషు, అరుణ్, షరీఫ్, ఓబులేసు, మధు, జేశాప్ రాష్ట్ర సలహాదారుడు భూమిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## దేవస్థానం సౌకర్యార్థం.. వాహనాలు విరాళం..



**శ్రీశైలం, జూన్ 8 (జనస్వరం) :** శ్రీశైలభ్రమరాంభ మల్లికార్జున స్వామివార్ల దేవస్థానం సౌకర్యార్థం కెనరబ్యాంక్ వారు రెండు వాహనాలను విరాళంగా అందజేశారు. ఆదివారం ఉదయం ఆలయం ముందుభాగం రథశాల వద్ద వాహనాలకు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించి తదుపరి కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావుకు వాహనాలకు సంభందించిన పత్రాలను బొలెరో మ్యాక్స్ పికప్, బొలెరో కంపేర్ వాహనాలను కెనరబ్యాంక్ కర్నూలు ప్రాంతీయ కార్యాలయం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుశాంత్ కుమార్ అందజేశారు. ఈ వాహనాల విలువ రూ.21.56 లక్షలు ఉంటుందని కెనరా బ్యాంక్ వారు తెలిపారు.

## శ్రీశైలమల్లన్న సన్నిధిలో.. భక్తుల కోలాహలం..



**శ్రీశైలం, జూన్ 8 (జనస్వరం) :** శ్రీశైలభ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామివార్లు కలవెలసిన దివ్యక్షేత్రమైన శ్రీశైలమహాక్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామివార్ల ఉభయ దేవాలయాలు భక్తజన కోలాహలంతో సందడిగా మారాయి. రద్దీ నేపథ్యంలో దేవస్థానం అధికారులు ఆలయ వేళల్లో మార్పు చేసి తెల్లవారుజామున 3.30 గంటలకే మంగళవాయిద్యాలు, సుప్రభాతసేవ, ప్రాతఃకాల పూజ, మంగళహారతి పూజలు నిర్వహించి తదుపరి 5గంటల నుంచి స్వామి అమ్మవార్ల దర్శనాలు, ఆర్జితసేవలకు వీలుకల్పించారు. వరుస సెలవులు రావడం, విద్యా సంస్థలు ప్రారంభం కానుండడంతో స్వామి అమ్మవార్లకు మొక్కులు తీర్చుకునేందుకు ఉభయదేవాలయాల ప్రాంగణంలో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూ లైన్లు తెల్లవారుజాము నుంచే భక్తులతో నిండిపోయాయి. ఈ క్రమంలో స్వామిఅమ్మవార్ల దర్శనాలు, ఆర్జితసేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండగా ఆలయ అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఆదివారం సుమారు 60 వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లుగా అంచనా. స్వామి అమ్మవార్ల దర్శనానికి రెండుమూడు గంటలపాటు సమయం పడుతుందని భక్తులు తెలిపారు. భక్తులు తిరుగు ప్రయాణంలో క్షేత్రపరిధిలోని ఉప ఆలయాలు సాక్షిగణపతి, హఠకేశ్వరం, పాలధార–పంచదార, శిఖరేశ్వరం, శ్రీశైలం జలాశయం సందర్శించడంతో ఆయా ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది.

# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూత



పలువురు ప్రముఖుల శ్రద్ధాంజలి









**హైదరాబాద్, జూన్ 8 (జనస్వరం) :** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, తెలంగాణ రాజకీయాల్లో బలమైన నేతగా పేరొందిన మాగంటి గోపీనాథ్ (61) ఆదివారం ఉదయం 5:45 గంటలకు హైదరాబాద్ ఏఐజీ హాస్పిటల్‌లో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గోపీనాథ్‌కి మెరుగైన వైద్యం అందించినా చికిత్సకు స్పందించకపోవడంతో మరణించారు. టీడీపీ ద్వారా 1983లో రాజకీయాల్లోకి ప్రవేశించిన గోపీనాథ్, 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా, 1987-88లో హుడా డైరెక్టర్‌గా, 1988-93 మధ్య వినియోగదారుల ఫోరం అధ్యక్షుడిగా సేవలందించారు. టీడీపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కూడా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 2014లో టీడీపీ తరపున జూబ్లీహిల్స్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, అనంతరం తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరారు. 2018లో టీఆర్ఎస్ టికెట్‌పై విజయం సాధించి, పబ్లిక్ ఎస్టిమేట్స్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2022లో టీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడయ్యారు. 1963 జూన్ 2న హైదరాబాద్ హైదర్‌గూడలో కృష్ణమూర్తి, మహానంద కుమారుల దంపతులకు జన్మించిన గోపీనాథ్, ఉస్మానియా యూనివర్శిటీలో బిఏ పూర్తిచేశారు. సునీతని వివాహం చేసుకున్న ఆయనకు ఒక కుమారుడు మాగంటి వాత్యల్యనాథ్, కుమార్తెలు అక్షర నాగ, దిశిర ఉన్నారు. రాజకీయ నేతగా కాకుండా సినీ నిర్మాతగా కూడా గోపీనాథ్ గుర్తింపు పొందారు. ఆయన నిర్మించిన సినిమాల్లో పాతబస్తీ (1995), రవన్న (2000), భద్రాద్రి రాముడు (2004), నా స్టైలే వేరు (2009) ప్రధానమైనవి. ఆయన పార్థివ దేహాన్ని జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో సాయంత్రం నాలుగు గంటలకు ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు నివాళులర్పించేందుకు పలువురు ప్రముఖులు వచ్చి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ సీఎం, టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయన పార్థివ దేహానికి పుష్పగుచ్ఛం అర్పించి కన్నీటి నివాళులిచ్చారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాగంటి మృతి పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కుమారుడు లోకేష్ దంపతులతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి చివరి వీడ్కోలు పలికారు. కేటీఆర్, హరీష్ రావు వంటి ప్రముఖ బీఆర్ఎస్ నేతలు గోపీనాథ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన ప్రజల మధ్య మానవీయతతో కూడిన నాయకుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఆయన రాజకీయ జీవితం కొత్త తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. మాజీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, కాంగ్రెస్ నేత అజరుద్దీన్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, నాయకులు రావుల శ్రీధర్ రెడ్డి, గంగుల ప్రభాకర్ తదితరులు, సినీ ప్రముఖులు మురళీమోహన్, జీవితా-రాజశేఖర్, బెల్లంకొండ సురేష్ తదితరులు మాగంటి గోపీనాథ్ పార్థివదేహానికి నివాళులర్పించారు. తెలంగాణ రాజకీయాల్లో విశ్వసనీయత, ప్రజలతో మమేకం, సేవా తపనకు మగంతి గోపీనాథ్ నిలువెత్తు ప్రతిరూపమని ఆయనతో చేరిన, ఆయనను కలిసి పని చేసిన రాజకీయ నాయకులు కొనియాడారు. ఆయన మృతితో జూబ్లీహిల్స్ కాదు, తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఒక శూన్యం ఏర్పడిందని ప్రజలు భావిస్తున్నారు.









## ఏంఈవో హరిలాల్ ఆధ్వర్యంలో పుస్తకాలు అందజేత



**బొంరాస్‌పేట, జూన్ 8 (జనస్వరం) :** ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన నిర్వహిస్తున్నామని ప్రభుత్వ పాఠశాలలో చేరి నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను పొందాలని మండల విద్యాధికారి హరిలాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు ఉచిత నూతన నోట్ పుస్తకాలను అందజేశారు.

## 10వ తరగతి టాపర్లకు నేడు సన్మానం



**బొంరాస్‌పేట, జూన్ 8 (జనస్వరం) :** మండల పరిధిలో పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన టాఎ ర్లుగా నిలిచిన విద్యార్థులను మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా సన్మానించనున్నట్లు మండల విద్యాధికారి హరిలాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డితో పాటు మండల నాయకులు హాజరుకానున్నారని వెల్లడించారు.

## పుల్ల మామిడి గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు

**తాగునీటి బావిని పరిశీలించిన నీటిపారుదల శాఖ జేఈ స్వర్ణలత, సర్పంచ్ లలిత**



**చింతపల్లి, జూన్ 8 (జనస్వరం) :** తాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని పుల్ల మామిడి గ్రామానికి తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తి గ్రామంలోని త్రాగునీటి బావిలో కుక్కను చంపి పడవేయడంతో గ్రామస్తులు నీరు వాడలేని దుస్థితి ఏర్పడింది. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని, నీటిపారుదల శాఖ జూనియర్ ఇంజినీర్ గడుతూరి స్వర్ణలత, చౌడుపల్లి సర్పంచ్ లలిత గ్రామాన్ని సందర్శించి బావిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తాత్కాలికంగా పంచాయతీ ఆధ్వర్యంలో నీటి ట్యాంకుల ద్వారా మంచినీటి సరఫరా చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే పెండ్లి మామిడి గ్రామం నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి శుద్ధజలాన్ని తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. బావి నీరు తాగి కొంతమంది గ్రామస్తులు అస్వస్థతకు గురవడంతో, ఆరోగ్య విభాగం ఏఎన్ఎం ప్రవల్లిక ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సరమండ ప్రవల్లికతో పాటు గ్రామస్తులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**విఆర్ పురం, జూన్ 8 (జనస్వరం) :** మండలంలో హైస్కూల్‌లో ఆదివారం 1988-89 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. స్నేహితులందరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ ఏరా ఎలాగున్నావ్.. ఎన్నెల్లో అయిందో మిమ్మల్ని చూసి ఇంట్లో అందరూ బాగున్నారా అంటూ ఒకప్పటి బాలి స్నేహితులు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్నారు.తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకసారిగా అందరూ కలుసుకొని బాలలుగా మారి ఆనందోత్సవాలతో తమ అమూల్యమైన సమయాన్ని కొద్ది గంటలపాటు గడిపారు. కరచాలనాలు కౌగిలింతలతో తమ కలయికను పూర్తికానివ్వక చిన్నప్పటి అనుభవాలను నెమరు వేసుకుంటూ మనస్ఫూర్తిగా నవ్వుకున్నారు. ఎన్నో భావోద్వేగాల మధ్య తమకు దొరికిన ఆ కొద్దీ మధుర క్షణాలను ఆనందంగా గడిపారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేసి అనంతరం తమ జ్ఞాపకాలను అనుభవాలను కుటుంబ సభ్యుల పరిచయాలతో తమకున్న కాలాన్ని గడిపారు. ఈ కార్యక్రమంలో చెలికాని ఉమా, కన్నబాబు బేతిరెడ్డి కర్నాటి ఏసు, మోహన్ రహీం తదితరులు పాల్గొన్నారు.ల

## ప్రధాన రహదారిని ఆక్రమిస్తున్న మాంసం దుకాణాలు

- ట్రాఫిక్‌కు అడ్డుగా మారుతున్న వ్యాపారులు
- ప్రజలలో మార్పు రాకపోవడంపై ఆవేదన





**చింతపల్లి, జూన్ 8 (జనస్వరం) :** మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మళ్లీ మాంసం దుకాణాల స్థాపన స్థానికుల ఆగ్రహానికి కారణమవుతోంది. ఇటీవల ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రహదారి విస్తరణ కోసం తహశీల్దార్ రామకృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో పలు అక్రమ దుకాణాలను తొలగించిన విషయం తెలిసిందే. అయితే, కొంతమంది మాంసం వ్యాపారులు అధికారుల ఆదేశాలను లెక్కచేయకుండా అదే రహదారిపై మళ్లీ తమ వ్యాపారాలు ప్రారంభించారు. వాహనాల రాకపోకలకు ప్రధానమైన ఈ రహదారిపై మాంసం దుకాణాలు, కొనుగోలు కోసం కూడిన జనం, పార్కింగ్ చేసిన వాహనాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ క్రమంలో ఏపీఎస్ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు రోడ్డుపై నిలిచిపోయే దశకు చేరుతున్నాయి. ఈ దృశ్యాన్ని ప్రతిబింబించేలా స్థానికులు తీసిన చిత్రాలు ప్రస్తుతం కనిపిస్తూ చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు వ్యాపారులు భంగం కలిగిస్తున్నారు. ప్రజలలో మార్పు రావాల్సిన అవసరం ఉందని కొంతమంది అభిప్రాయపడ్డారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రక్షణ దృష్ట్యా ఈ తరహా అక్రమ వ్యాపార కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## బోరిగాం గ్రామంలో బుద్ధ విహార్ నిర్మించాలి

**బౌద్ధ సంఘాల డిమాండ్**



**భైంసా, జూన్ 8 (జనస్వరం) :** ముధోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో ఇటీవల జరిగిన సంఘటన దళితులు, బౌద్ధ సంఘాల్లో తీవ్ర ఆవేదనకు దారి తీసింది. ప్రభుత్వ భూమిలో అంబేద్కర్ సంఘం సభ్యులు బుద్ధ జయంతి రోజున బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, అదే స్థలంలో హను మాన్ విగ్రహం గతంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులచే ప్రతిష్ఠించారు. ఈ నేపథ్యంతో గ్రామం లో ఉద్రిక్తత నెలకొంది. అంబేద్కర్ సంఘం సభ్యులు బుద్ధ వందనలు చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు బుద్ధ విగ్రహాన్ని ప్రభుత్వ భూమిలో పెట్టవద్దని వ్యతిరేకిస్తూ రాళ్లతో దాడికి పాల్పడ్డారు. అనంతరం అధికారులు అంబేద్కర్ సంఘానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అక్కడి బుద్ధ విగ్రహాన్ని తొలగించడంతో బౌద్ధులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించిన బౌద్ధ చర్య భారత్ బ్రాహ్మన్ బిక్కు బిక్కునీ సంఘం జిల్లా అధ్యక్షుడు వాగ్మారే రామ్ రావ్, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రెండు ఎకరాల భూమిని కేటాయించి బుద్ధ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. లేదంటే బుద్ధగయలో కొనసాగుతున్న ముక్తి ఆందోళన తరహాలో బోరిగాం గ్రామంలో కూడా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. “బుద్ధ విగ్రహాన్ని తొలగించి హనుమాన్ విగ్రహాన్ని అలాగే ఉంచడమంటే రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాం గం అందరికీ సమాన హక్కులు కల్పించింది. అశోకుడి కాలంలో దేశంలో 84 వేల బౌద్ధ స్థూపా లు నిర్మించబడ్డాయి. బుద్ధుడి పేరుతో రెండు ఎకరాల భూమి కేటాయించలేకపోవడం దారుణం. బుద్ధుడు ఈ దేశంలో జన్మించిన గొప్ప మహానుభావుడు. ప్రపంచ దేశాలకు భారత ప్రధాని కూడా ఇదే గర్వంగా చెబుతారు. అలాంటి బుద్ధుని విగ్రహాలను అవమానపరిచే విధంగా వ్యవహరించడం బాధాకరం,” అని రామ్ రావ్ వ్యాఖ్యానించారు. బుద్ధ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి, బుద్ధ విహార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, న్యాయం చేయకపోతే శాంతియుతమైన అయినా శక్తివంతమైన ఉద్యమాలకు సిద్ధమవుతామని బౌద్ధ సంఘాలు స్పష్టం చేశాయి.

## ఎమ్మెల్యే వివేక్ వేంకటా స్వామికి మంత్రి పదవి.. సంతోషకరం

**- బుద్దిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి రాహుల్ మద్నూరే**



**భైంసా, జూన్ 8 (జనస్వరం) :** తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ఎమ్మెల్యే వివేక్ వేంకటస్వామికి పదవి లభించడాన్ని బుద్ధిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థి రాహుల్ మద్నూరే సంతోషం వ్యక్తం చేశారు. మాల సామాజిక వర్గానికి మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం కల్పించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి వివేక్ వేంకటస్వామి నిండు హృదయంతో చేసిన సేవకు ఇది న్యాయమైన గుర్తింపుగా అభివర్ణించారు. ప్రత్యేకంగా, తెలంగాణ ఉద్యమాన్ని ఢిల్లీ దాకా తీసుకెళ్లి, జాతీయ నేతలను ఒప్పించి, పార్లమెంటులో తెలంగాణ బిల్లుకు మద్దతు సాధించిన అస లైన ఉద్యమకారుడికి ఈ పదవి లభించడం గర్వకారణమన్నారు. మాలల హక్కుల కోసం, వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తదుపరి రోజుల్లో మరింత న్యాయం చేయాలని కోరారు. వివేక్ వెంకటస్వామి దీర్ఘ కాలంగా చేసిన కృషికి ఇది తగిన గుర్తింపు అని పేర్కొన్నారు.

## డయల్ యువర్ కమిషనర్ సమయంలో మార్పు



**తిరుపతి, జూన్ 8 (జనస్వరం) :** ప్రతి సోమవారం నగరపాలక సంస్థలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం పరిపాలన కారణాల వలన 10.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నామని నగర పాలక సంస్థ కమి షనర్ ఎన్.మౌర్య ఆదివారం తెలిపారు. కాగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక యధావిధిగా నిర్వహిస్తామని తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూన్ 9వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఫోన్ ద్వారా ఫిర్యా దులు చేసేవారు 0877-2227208కి కాల్ చేసి మాట్లాడవచ్చుని, తిరుపతి ప్రజలకు కమిషనర్ మౌర్య తెలియజేశారు.

## పాఠశాలలు పునఃప్రారంభం రోజునే విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ

**మండల విద్యాశాఖ అధికారి పీవీవీవీ ప్రసాద్**



**చింతపల్లి, జూన్ 8 (జనస్వరం) :** ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను అందించేందుకు చర్యలు తీసుకున్నామని మండల విద్యాశాఖ అధికారి పనసల వీర వెంకట వరప్రసాద్ వెల్లడించారు. విద్యార్థుల అకాడమిక్ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ కిట్లు విద్యార్థులకు అవసరమైన నోటుబుక్స్, పాఠ్య పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కూల్ బ్యాగ్ తదితర విద్యా సామగ్రిని కలిగి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో తొలిరోజే విద్యార్థులకు ఈ కిట్లు అందజేయాల్సిందిగా ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు ఉత్సాహంతో, సమగ్రంగా విద్యాభ్యాసం కొనసాగించేందుకు ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానికంగా విద్యారంగంలో నాణ్యతా ప్రమాణాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జర్ర కొండలరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమస్యలతో సతమతమవుతున్న చింతపల్లి ఏపీఎస్ఆర్టీసీ బస్సు స్టాండ్

- శిథిల వ్యవస్థకు చేరిన ప్రయాణికులు కూర్చొనే బెంచీలు
- వినియోగంలో లేని మరుగుదొడ్లు.. ఉపయోగం లేని టీవీ
- చోద్యం చూస్తున్న ఏపీఎస్ఆర్టీసీ అధికారులు




**చింతపల్లి, జూన్ 8 (జనస్వరం) :** అంతర్ రాష్ట్ర బస్సు రాకపోకలకు కేంద్రబిందువైన చింతపల్లి ఏపీఎస్ఆర్టీసీ కాంప్లెక్స్ మౌలిక సదుపాయాల కొరతతో నిత్యం ప్రయాణికులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టుతోంది. పెదవలస, కేడి పేట, నర్సీపట్నం, కొయ్యూరు, రంపచోడవరం, సీలేరు, లంబసింగి, జిమాడుగుల, పాడేరు, అరకూ వ్యాలీ వంటి ప్రాంతాలకు రోజువారీగా బస్సులు నడుస్తున్నా.. బస్సు స్టాండ్‌లో కనీస వసతులు లేకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బెంచీలు పూర్తిగా శిథిలావస్థకు చేరగా, మరుగుదొడ్లు పని చేయక మూసివేయబడ్డాయి. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు, ఈ సమస్యల వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మౌలిక వసతుల కొరతతో ప్రయాణికులు గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పైగా వినోదం కోసం ఏర్పాటు చేసిన టీవీ కూడా పనిచేయక ఉండటంతో ప్రయాణదారుల నిరీక్షణ మరింత కష్టంగా మారుతోంది. చింతపల్లి నుంచి ఒరిస్సా సరిహద్దు ప్రాంతాలకు వెళ్లే బస్సుల రాకపోకల నేపథ్యంలో ఈ బస్ స్టాండ్ ప్రాధాన్యత మరింత పెరిగింది. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడం ప్రయాణికుల్లో ఆగ్రహం రేకెత్తిస్తోంది. ప్రతి రోజు వేల మంది ప్రయాణికులు ఇక్కడ నుంచి ప్రయాణిస్తున్నారు. అయినా కనీస మరమ్మతులు చేయకుండా, శుభ్రతపై దృష్టి పెట్టకుండా అధికారులు విస్మృతిలో పడిపోయారని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఏపీఎస్ఆర్టీసీ అధికారులు స్పందించి, మరుగుదొడ్ల మరమ్మతులు, కొత్త బెంచీల ఏర్పాటు, సమాచార వ్యవస్థ పునరుద్ధరణ వంటి చర్యలు తీసుకొని బస్సు స్టాండ్‌ను ప్రయాణికులకు అనుకూలంగా తీర్చిదిద్ది, మౌలిక వసతులు కల్పనతో వినియోగంలోకి తీసుకురావాలని అంతర్ రాష్ట్ర ప్రయాణికులు కోరుతున్నారు.

# వైసీపీ కాలకేయుల పాపాలకు ప్రాయశ్చిత్తం లేదు

- మహిళా లోకానికి వైసీపీ నేతలు బహిరంగ క్షమాపణలు చెప్పాలి
- అమరావతిపై ఇప్పటికీ వైసీపీ నేతలకు నిలువెల్లా విషమే
- కూటమి ప్రభుత్వంలో రాజధాని నిర్మాణం శరవేగంగా అభివృద్ధి చెందటాన్ని వైసీపీ సైకోలు జీర్ణించుకోలేక పోతున్నారు
- అమరావతిని వేశ్యల రాజధాని అనటం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది
- రాజధాని కోసం వేల ఎకరాల భూమినిచ్చిన రైతుల త్యాగాలకు వైసీపీ నేతలు ఇచ్చే బహుమతి ఇదా?
- జర్నలిజ వ్యభిచారులు కేఎస్ఆర్, కృష్ణంరాజులపై ప్రభుత్వం అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలి
- పశ్చిమ విభాగ డిఎస్పీ అరవింద్‌కు జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఫిర్యాదు



**గుంటూరు, జూన్ 8 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** అధికారాన్ని అడ్డం పెట్టుకొని వైసీపీ నేతలు సాగించిన దమనకాండను, దాష్టికాలను అధికారం కోల్పోయినా కూడా ఆ పార్టీ కాలకేయులు ఇంకా కొనసాగిస్తూనే ఉన్నారని, వైసీపీ నేతల పాపాలకు ప్రాయశ్చిత్తం లేదని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతిని వేశ్యల రాజధానిగా అభివర్ణిస్తూ సాక్షి ఛానెల్ లో పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజులు చేసిన వ్యాఖ్యలపై అయన తీవ్ర అగ్రహాన్ని వ్యక్తం చేశారు. మహిళల ఆత్మగౌరవానికి, ఆత్మభిమానానికి భంగం కలిగేలా మాట్లాడిన వీరిరువురిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివారం జనసేన శ్రేణులు పశ్చిమ విభాగ డీయస్పి కే అరవింద్‌కు ఫిర్యాదు చేసాయి. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్‌కు బంగారుబాట వేసే రాజధానిపై వైసీపీ నేతలు మెదటి నుంచి కాలకూట విషం చిమ్ముతూనే ఉన్నారని విమర్శించారు. కమరావతనీ, స్మశానమని, దళారుల నిలయమని ఎన్ని విష ప్రయోగాలు చేసినా ఫలించకపోవటంతో ఇప్పుడు మహిళలపై ఇంతటి దారుణ వ్యాఖ్యలకు ఒడిగట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో రాజధాని అభివృద్ధి శరవేగంతో ముందుకు సాగుతుందటంతో వైసీపీ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. రాజధాని నిర్మాణం కోసం వేల ఎకరాల పంట భూమిని త్యాగం చేసిన రైతులకు వైకాపా ఇచ్చే గౌరవం ఇదా అని ప్రశ్నించారు. పాత్రికేయుల ముసుగులో ఉన్న వైసీపీ చీడ పురుగులైన కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. వీరు చేసిన వ్యాఖ్యలు కేవలం రాష్ట్ర మహిళల మనసులనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు మహిళామణుల హృదయాలను ఛిద్రం చేశాయన్నారు. ఇంత జరుగుతున్నా సాక్షి ఛానెల్ చైర్మన్ వై యస్ భారతీ రెడ్డిలో ఏ మాత్రం చలనం లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఒక వార్త ఛానెల్ ప్రజల్ని అవమానించటానికి వేదిక అవ్వటం ప్రజాస్వామ్యానికి ప్రమాదసూచికని ఆందోళన వ్యక్తం చేశారు. జనసేన పార్టీ రాజధాని రైతుల వెంటే ఉంటుందని, మహిళల గౌరవాన్ని, ఆత్మభిమానాన్ని కాపాడే బాధ్యతను సమర్ధవంతంగా మోస్తుందని ఆళ్ళ హరి అన్నారు. పశ్చిమ విభాగ డీఎస్పీ అరవింద్ మాట్లాడుతూ జనసేన నాయకులు ఇచ్చిన ఫిర్యాదుపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మెహబుబ్ బాషా, స్టూడియో బాలాజీ, నందూరి స్వామి, పగిడిపోగు రమేష్, మిరియాల వెంకట్, షంషేర్, మంత్రి లోకేష్ పాల్గొన్నారు.

## సీపీఐ శాఖల మహాసభలను జయప్రదం చేయండి

**పట్టణ కార్యదర్శి పేలూరి రామారావు**



**చిలకలూరిపేట, జూన్ 8 (జనస్వరం) :** భారతదేశంలో శతాబ్దం పైగా సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రతినిధి గానూ, ప్రజాస్వామ్య విలువలకు అండగా నిలుస్తున్న భారత కమ్యూ నిస్టు పార్టీ (సీపీఐ) పట్టణ శాఖల మహాసభలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి పేలూరి రామారావు మాట్లాడుతూ రాష్ట్ర సీపీఐ మహాసభలు ఒంగోలు నగరం లో జరుగుతున్న నేపథ్యంలో, పట్టణ శాఖల మహాసభలలో స్థానిక స్థాయి సమస్యలపై సుదీర్ఘ చర్చలు జరుగుతాయని, అలాగే ప్రతి శాఖలో కొత్త నాయకత్వాన్ని ఎన్నుకునే ప్రక్రియ కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల బాధ్యులు అందరూ ఈ మహాసభలలో పాల్గొని విజయవంతం చేయాలని రామారావు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై ఉద్యమించడానికి, సమాజ నిర్మాణంలో పాత్ర పోషించడానికి ఈ మహాసభలు దిశానిర్దేశకంగా నిలవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆయిల్ పామ్ రైతుల సమస్యలపై ధర్నా



**ఏలూరు, జూన్ 8 (జనస్వరం) :** ఆయిల్ పామ్ రైతులు వారి సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. రైతులు కేంద్ర ప్రభుత్వం పామాయిల్ దిగు మతి సుంకం 10 శాతం తగ్గించిన కారణంగా ఆయిల్ పామ్ గెలల ధర పడిపోయి నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నే భవనంలో జరిగిన సమావేశంలో కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, పెరిగిన ఉత్పత్తి ఖర్చుల కారణంగా టన్నుకు రూ.22 వేలు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకం 50 శాతం పెంచాలని, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, పెదవేగి ఆయిల్ ఫెడ్ ప్రైవేట్ పనులను నిలిపివేయాలని, కొత్త ఫ్యాక్టరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని కె.శ్రీనివాస్ కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు.

## రాజకీయ కక్షతో గోడ కూల్చివేత

**బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే అబ్బాయి చౌదరి పరామర్శ**

**దెందులూరు, జూన్ 8 (జనస్వరం) :** చల్ల చింతలపూడిలో ఎంపీటీసీ సింహాద్రి పద్మావతి, మాజీ సర్పంచ్ సింహాద్రి శ్రీమన్నారాయణ ఇంటి ప్రహరీ గోడ కూల్చివేత రాజకీయ కక్ష దోరణికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బాయి చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నుంచి వైసీపీకి చేరినందుకే ఈ దాడి జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదివారం ఫోన్ ద్వారా బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అబ్బాయి చౌదరి, సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ధైర్యం చెబుతూ, "వైసీపీ మీ వెంటే ఉంది. మీకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుంది," అని భరోసా ఇచ్చారు. ఇలాంటి దాడులు పూర్తిగా అప్రజాస్వామికమైనవని, ప్రహరీ గోడ కూల్చివేతపై తగిన చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులతో మాట్లాడతానని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలకు పాల్పడినవారు తప్పకుండా మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో ఇలాంటి దుర్మార్గపు చర్యలు పునరావృతమైతే వైసీపీ కళ్లుతెరిచి చూస్తూ ఊరుకోదని హచ్చరిస్తూ పేర్కొన్నారు.

## వెబ్ కౌన్సిలింగ్ విధానాన్ని నిరసిస్తూ డీఈఓ కార్యాలయ ముట్టడి

- మాన్యువల్ కౌన్సిలింగ్ విధానమే కొనసాగించాలి
- మస్తాన్ మాదిగ





నెల్లూరు, జూన్ 8 (జనస్వరం) : ఉపాధ్యాయ బదిలీల విషయంలో వెబ్ కౌన్సిలింగ్ విధానాన్ని అమలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, మాన్యువల్ కౌన్సిలింగ్ విధానానికే కట్టుబడి ఉండాలని డిమాండ్ చేస్తూ మహాజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు డీసీఓ కార్యాలయం ఎదుట బహిరంగ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మస్తాన్ మాదిగ, ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య మాదిగ, జిల్లా అధ్యక్షులు రవిప్రసాద్, కార్యదర్శులు పీరయ్య, చలపతి, రాజ్ కుమార్, ఇతర సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ మస్తాన్ మాదిగ మాట్లాడుతూ "రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ ప్రకారం ఎస్.జి.టి. బదిలీలను మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారానే నిర్వహించాలి. డీఎస్సీ పరీక్షల కోసం సన్నద్ధమవుతున్న అనేక మంది ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు ప్రస్తుతం బదిలీల ప్రక్రియలో ఉన్నారు. వారి పరీక్షలు ముగిసేవరకు బదిలీలను వాయిదా వేయాలి. అంతేకాక, పదోన్నతులలో ఎస్సీ ఉపవర్గాలైన మాదిగలకూ మాలలకూ వేర్వేరు గణన జరిపి, వర్గీకరణ ఆధారంగా న్యాయం జరగాలి" అని డిమాండ్ చేశారు. ఇక అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య మాట్లాడుతూ "మాన్యువల్ కౌన్సిలింగ్‌తో పాటు, ప్రిఫెరెన్షియల్ పాయింట్లను నిర్బంధంగా ఫ్రీజ్ చేయకుండా, అవసరమైతే ఉపాధ్యాయులే వాటిని వినియోగించుకునే అవకాశం కల్పించాలి" అని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్ మాట్లాడుతూ "గత స్కూల్ అసిస్టెంట్ బదిలీల్లో సీనియర్లకు జరిగిన అన్యాయం సరిచేయాలి. అలాగే, 'షైనింగ్ స్టార్స్' విద్యార్థుల ఎంపికలో ఎస్సీలను వర్గీకరించి మాల, మాదిగలుగా విడిగా ఎంపిక చేయడం ద్వారా విద్యా రంగంలో సమానత్వానికి బాట వేయాలి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు నినాదాలతో కార్యాలయాన్ని ముట్టడి చేయగా, మాస్కులు ధరించి, శాంతియుతంగా నిరసన చేపట్టారు.

## శ్రీశైలంలో గాలివాన బీభత్సం

**వసతిగృహాలకే పరిమితమైన భక్తజనం**



**శ్రీశైలం, జూన్ 8 (జనస్వరం) :** ప్రఖ్యాత శైవక్షేత్రం శ్రీశైలం మండలపరిధిలో ఆదివారం సాయంత్రం గాలివానతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. సాయంత్రం ఏకధాటిగా కురిసిన వర్షంతో పలుచోట్ల రహదారులలో భారీగా వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో స్థానికులు భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. స్వామివార్ల దర్శనార్థం వచ్చిన భక్తులు వసతిగృహాలకే పరిమితమయ్యారు. భారీ వర్షం కారణంగా క్షేత్ర పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షం కారణంగా భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎగువ అటవీ ప్రాంతంలో నుంచి క్షేత్రంలోని కొత్తపేట, శ్రీగిరి కాలనీల్లో వర్షపు నీరు పోటెత్తింది. సుండిపెంటలో రహదారులు జలమయమయ్యాయి.

# ప్రత్తిపాటి చొరవతో నూతన వార్డు ఏర్పాటునా?

**చిలకలూరిపేట, జూన్ 8 (జనస్వరం) :** పట్టణ శివారులోని మంచినీటి చెరువు వద్ద ఉన్న ఎన్టీఆర్ నగర్ టిడ్కో గృహ సముదాయంలో ప్రస్తుతం సుమారు రెండు వేల మందికి పైగా జనాభా నివసిస్తోంది. ఆయా వార్డుల నుంచి వచ్చిన నిరుపేదలు ఇక్కడకు తరలి వచ్చారు. ప్రస్తుతం కొంతమంది మాత్రమే నివసిస్తున్నా, ఖాళీగా ఉన్న గృహాల పట్ల ఆసక్తి పెరుగుతుండటంతో జనాభా మరింతగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, టిడ్కో గృహాల ప్రాంతాన్ని ప్రత్యేక వార్డుగా గుర్తించాలన్న డిమాండ్ జోరందుకుంది. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో గణపవరం, మానుకొండ వారి పాలెం, పసుమర్రు గ్రామాలు వార్డులుగా ఏర్పడగా, వీటిపై న్యాయస్థానంలో విచారణ కొనసాగుతోంది. న్యాయస్థానం తీర్పు ఇచ్చిన అనంతరం పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశముంది. ఇప్పటికే ఈ గ్రామాలను చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనం చేసి, మొత్తం వార్డుల సంఖ్యను 38కి పెంచారు. కానీ వాటిని మున్సిపాలిటీలో నుంచి తొలిగిస్తే మళ్లీ మున్సిపాలిటీ 34 వార్డులకే పరిమితమవుతుంది. ఈ సమయంలో టిడ్కో గృహాల సముదాయాన్ని 35వ వార్డుగా ఏర్పాటు చేస్తే చిలకలూరిపేట మున్సిపాలిటీ పునః స్థిరపడుతుంది. నూతన వార్డు ఏర్పాటు జరిగితే అభివృద్ధికి దోహదపడుతుందని, తాము అన్ని విధాలుగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెబుతున్నారు. ఇప్పటికే ఆయన చొరవతో అధికారులు పలుచోట్ల పరిశీలనలు నిర్వహించినట్లు సమాచారం. టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాల కొరత ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టుతోంది. అంగన్వాడి కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, రేషన్ డీలర్ షాపు, కమ్యూనిటీ హాల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వంటి అవసరాలు ఇప్పటికీ నెరవేరని పరిస్థితి ఉంది. ఈ అంశాలపై టీడీపీ సీనియర్ నాయకులు జంగా వినాయకరావు, 38వ వార్డు కౌన్సిలర్ జంగా సుజాత దంపతులు, నర్సుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండ్రముట్ల నాగేశ్వరరావు ఎప్పటికప్పుడు స్థానిక అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతులు అందజేస్తున్నారు. టిడ్కో వాసులు కూడా పలు సమస్యలపై మున్సిపల్ అధికారుల తీరును తప్పుబడుతున్నారు. గృహ సముదాయం లోపల కొందరు వ్యక్తులు స్థలాలను ఆక్రమించి నగదు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికార యంత్రాంగం సమర్ధంగా వ్యవహరిస్తే షాపింగ్ కాంప్లెక్స్‌లు వంటి వాణిజ్య పథకాలు అమలయ్యే అవకాశం ఉంటుందనీ, తద్వారా మున్సిపాలిటీకే కాకుండా ప్రజలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నూతన వార్డు ఏర్పాటు, మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు పాలనలో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం పెరిగితే ఈ ప్రాంతానికి మరింత జీవం కలిగే అవకాశాలు ఉన్నాయని సామాన్య ప్రజల నుంచి వస్తున్న స్పందన ఆధారంగా చెప్పవచ్చు.

# 25 జిల్లాల్లో క్రికెట్ స్టేడియాలు నిర్మించే విధంగా ప్రణాళికలు

- ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని)
- నోవాటెల్ హెూటల్‌లో ఏసీఏ 72వ యాన్యువల్ జనరల్ బాడీ మీటింగ్
- వైజాగ్ స్టేడియంలో ఐదు ఉమెన్స్ క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచులు
- త్వరలో వన్డే ఇంటర్నేషన్ మ్యాచ్ వైజాగ్ స్టేడియంలో జరిగే అవకాశం
- రెండేళ్లలో ఏసీఏకి రాష్ట్ర వ్యాప్తంగా క్రికెట్ గ్రౌండ్ వుండే విధంగా ప్రణాళిక
- ఏసీఏకి సొంత స్థలాలు వున్న కర్నూల్, నెల్లూరులో క్రికెట్ స్టేడియాల అభివృద్ధికి కృషి
- త్వరలో ఏసీఏ ఆధ్వర్యంలో ఏపీఎల్ మ్యాచులు నిర్వహణ
- అమరావతిలో నిర్మించబోయే స్పోర్ట్స్ సిటీలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం
- డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్‌కి ఇచ్చే ఫండ్ డబుల్ చేసిన ఏసీఏ
- గతంలో ఏడాదికి రూ. 20 లక్షలు, ఇక నుంచి ఏడాదికి రూ.40 లక్షలు



**విజయవాడ, జూన్ 8 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** "రాష్ట్రంలోని 25 జిల్లాల్లో క్రికెట్ గ్రౌండ్స్ వుండే విధంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తాం. రాబోయే రెండేళ్లలో ఏసీఏ కి సొంత గ్రౌండ్లు వుండే విధంగా ప్రణాళిక రూపొందించాం. ఏసీఏకి సొంత స్థలాలు వున్న కర్నూల్, నెల్లూరు ప్రాంతాల్లో క్రికెట్ గ్రౌండ్స్ అభివృద్ధి చేస్తున్నాం. వీటితోపాటు మరింత మంది క్రికెట్ క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఏపీఎల్ నిర్వహించబోతున్నాం. ఈ ఏపీఎల్‌లో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి ఐపీఎల్‌లో ఆడే విధంగా కృషి చేస్తాం" అని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ 72వ యాన్యువల్ జనరల్ బాడీ మీటింగ్ స్థానిక నోవాటెల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏసీఏ అపెక్స్ సభ్యులతో పాటు, డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇంటర్నేషనల్ ప్లేయర్స్ పాల్గొన్నారు. జనరల్ బాడీ మీటింగ్ అనంతరం ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, సెక్రటరీ సానా సతీష్, అపెక్స్ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ 72వ యాన్యువల్ జనరల్ బాడీ మీటింగ్ కి ఏసీఏ సభ్యులందరూ హాజరయ్యారన్నారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. ఏసీఏ అధ్యక్షుడిగా తన ఆధ్వర్యంలో జరిగిన మొదటి యాన్యువల్ జనరల్ బాడీ మీటింగ్ చాలా బాగా జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎనిమిది నెలల క్రితం ఎంపికైన ఏసీఏ అపెక్స్ బాడీ ఎన్నికైన దగ్గర నుంచి క్రీడాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. వైజాగ్‌లో ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచులు జరిగే విధంగా స్టేడియాన్ని కేవలం 45 రోజుల్లో ఆధునీరకరణ పనులు పూర్తి చేశామన్నారు. వైజాగ్‌లో నాలుగు ఐపీఎల్ మ్యాచులు కేటాయించాలని కోరగా, సమయభావం వల్ల రెండు మ్యాచులు మాత్రం జరిగాయన్నారు. స్టేడియం ఆధునీకరణ పనులు చూసి బీసీసీఐ ప్రతినిధులు, ఐసీసీఐ చైర్మన్ జైషా కూడా సంతృప్తి వ్యక్తం చేయటంతో పాటు, జైషా బీసీసీఐకి వైజాగ్ స్టేడియానికి మరిన్ని మ్యాచులు కేటాయించాలని సూచించినట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా వైజాగ్ స్టేడియంలో ఉమెన్ క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచులు 5 శాంక్షన్ అయినట్లు తెలిపారు. అదే విధంగా ఇంటర్నేషనల్ వన్డే క్రికెట్ మ్యాచ్ శాంక్షన్ కాబోతుందని తెలిపారు. ఏసీఏ రాబోయే కాలంలో క్రీడాకారులను తయారు చేయటమే కాకుండా క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు, వసతులు కల్పించి వారిని ప్రోత్సహించటమే ధ్యేయంగా పనిచేయనుందన్నారు. రాష్ట్రంలో క్రికెట్ మ్యాచుల నిర్వహణకు ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైజాగ్ లాంటి మంచి స్టేడియం తయారు చేస్తేనే క్రికెట్ మ్యాచులు జరగటంతోపాటు ఫ్రాంఛైజీలు కూడా ఆసక్తి చూపిస్తాయన్నారు. వైజాగ్ స్టేడియంను మరింతగా రెడీ చేసి మరిన్ని మ్యాచులు, మరిన్ని ఫ్రాంఛైజీలు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. గత ఎనిమిది నెలలుగా ఏసీఏ చేసిన కృషిని జనరల్ బాడీ మీటింగ్ వచ్చిన సభ్యులు అభినందించారన్నారు. క్రికెట్ క్లబ్‌లు కూడా క్రికెట్ పోటీలు నిర్వహించాలని కోరగా సభ్యులు ఆ ప్రతిపాదనను ఏకగ్రీవంగా అంగీకరించారని తెలిపారు. ఇక నుంచి అన్ని జిల్లా క్రికెట్ అసోసియేషన్స్ గ్రౌండ్స్‌లో ఏడాదిలో 200 రోజులు క్రికెట్ మ్యాచులు జరిగే విధంగా ప్రణాళిక రూపొందించటం జరిగిందన్నారు.

**అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి 65 ఎకరాలు :**
అమరావతి రాజధాని ప్రాంతంలో నిర్మించబోయే స్పోర్ట్స్ సిటీలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వుంటుందని ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ తెలిపారు. ఈ క్రికెట్ స్టేడియం గురించి రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడుతున్నట్లు తెలిపారు. మంచి వసతులు వున్న స్టేడియం అంతర్జాతీయ స్థాయిలో వుండే విధంగా నిర్మించాలని సంకల్పంతో సీఎం చంద్రబాబు వున్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని 65 ఎకరాలు అడగటం జరిగిందన్నారు. అహ్మాదాబాద్ స్టేడియం తర్వాత లక్ష మంది వీక్షించే విధంగా అమరావతి రాజధాని ప్రాంతంలో స్టేడియం నిర్మించాలనేది ఏసీఏ ఆలోచన అని చెప్పారు. ఇప్పటికే ఈ అంశంపై ఏసీఏ సెక్రటరీ సానా సతీష్, మంత్రి నారా లోకేష్ సహాయంతో ఐసీసీఐ చైర్మన్ జైషా, బిసిసిఐతో ప్రాథమిక చర్చలు చేయటం జరిగిందన్నారు. త్వరలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌కి స్థలం రాగానే దానిపై నిర్ణయం జరుగుతుంది. బిసిసిఐ సూత్ర ప్రాయంగా అంగీకారం తెలిపిందన్నారు.

**ఫస్ట్ టైమ్ రాష్ట్రంలో వరల్డ్ కప్ క్రికెట్ పోటీలు : సానా సతీష్**
ఈ సమావేశంలో ప్రతి జిల్లాలో క్రికెట్ స్టేడియం కోసం ప్రత్యేకంగా చర్చించటం జరిగిందని ఏసీఏ సెక్రటరీ సానా సతీష్ తెలిపారు. ప్రతి జిల్లాలో క్రికెట్ గ్రౌండ్ డెవలప్ చేయాలని డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ వాళ్లు ప్రపోజల్ ఇవ్వటం జరిగిందని, ఆ విధంగా ఏసీఏ కృషి చేస్తుందన్నారు. ఏపీలో ఫస్ట్ టైమ్ వరల్డ్ కప్ పోటీలు జరగనుండటం ఆనందంగా ఉందన్నారు. ఉమెన్స్ క్రికెట్ వరల్డ్ కప్ పోటీలు సెప్టెంబర్ అక్టోబర్‌లో జరుగుతాయన్నారు. ఐదు మ్యాచులు కేటాయించినందుకు బిసిసిఐ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఏసీఏ డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్లకు ఏడాదికి ఇచ్చే ఫండ్‌ను రూ.డబుల్ చేయటం జరిగిందన్నారు. లోకల్ క్రికెట్ డెవలప్మెంట్ కోసం ఇచ్చే ఫండ్‌ను 20 లక్షల నుంచి 40 లక్షలు పెంచటం జరిగిందన్నారు. దీని వల్ల క్రికెట్ మరింతగా అబివృద్ధి చెందుతుందని. ఎక్కువగా క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు. వైజాగ్ స్టేడియం 45 రోజుల్లో ఆధునీకరణ పనులు పూర్తి అయ్యే విధంగా సహకరించినందుకు అపెక్స్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.వెంకట రమా ప్రశాంత్, ట్రెజరర్ దండుమూడి శ్రీనివాసరావు, కౌన్సిలర్ దంతు విష్ణు తేజ, మేల్ రిప్రజెంటివ్ ప్రసన్న కుమార్, ఫిమేల్ రిప్రజెంటివ్ గీత, ఇంటర్నేషనల్ ప్లేయర్స్ ఎమ్మెస్ కే ప్రసాద్, ఆర్. కల్పన డిస్టిక్ క్రికెటర్ అసోసియేషన్ ప్రతినిధులు, అపెక్స్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆధునిక భారతదేశ నిర్మాణంలో స్ఫూర్తి వంతమైన సేవలు అందించిన నేత బాబూ జగజ్జీవన్ రామ్

- మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూ జగజ్జీవన్ రామ్ సేవలు కొనియాడిన నేతలు
- ముఖ్య అతిథులుగా హాజరైన పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు
- కృష్ణలంక రాణిగారి తోటలో బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ



**విజయవాడ, జూన్ 8 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** అటు స్వాతంత్రోద్యమంలో మహాత్మగాంధీకి, ఇటు రాజ్యాంగ రచన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కి చేదోడు వాదోడు వుంటూ సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన మహనీయుడు మాజీ ఉపప్రధానమంత్రి బాబు జగజ్జీవన్ రామ్, ఆయన అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం జీవితాంతం సాగించిన పోరాటం ఎప్పటికీ స్ఫూర్తి దాయంగా నిలుస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందా కష్ణ మాదిగ అన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం కృష్ణలంక రాణి గారితోటలో మాదిగ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు జగజ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించి ఘన నివాళులర్పించారు. అనంతరం మాదిగ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలందర్నీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, స్వరాజ్యం వచ్చిన తర్వాత ఆధునిక భారతదేశ నిర్మాణంలోనూ స్ఫూర్తి వంతమైన సేవలు దేశానికి బాబూ జగజ్జీవన్ రామ్ అందించారని కొనియాడారు. సామాజిక సమానత్వం కోసం, వెనకబడిన వర్గాల కోసం పోరాడిన దార్శనికుడు జగజ్జీవన్ రామ్ అన్నారు. బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించిన కడియాల నాగుని అభినందించారు. అదే విధంగా మందా కృష్ణ మాదిగ తో వున్న తన స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు. మందా కృష్ణ మాదిగతో చర్చించిన తర్వాతే తను ప్రజాజీవితంలోకి అడుగుపెట్టినట్లు వివరించారు. తన జీవితాన్ని ఉద్యమానికి అంకితం చేసిన ప్రజానాయకుడు మందా కృష్ణ మాదిగతో ఈ కార్యక్రమంలో పాల్గొనటం చాలా ఆనందంగా వుందన్నారు. ఈ మధ్య కాలంలో ప్రజల మధ్య నుంచి ఉద్భవించిన మహానాయకుడు కృష్ణ మాదిగ అంటూ ప్రశంసించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చంద్రబాబు నాయుడు పాదయాత్ర చేసే సమయంలో ఆ పాదయాత్ర విజయవాడ చేరే వరకు తన అనుచరులతో అండగా నిలబడ్డారన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుర్తించే స్థాయికి మందా కృష్ణ మాదిగ ఎదిగాడంటే, ఆ ఉద్యమం వెనక నిబద్దత, నిజాయితీ వుండటమే కారణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు మందా కృష్ణ మాదిగ అండగా నిలబడ్డారు. అంతకంటే ముందు ఎన్టీఆర్‌కి బాబూ జగజ్జీవన్ రామ్ మంచి స్నేహంగా వుండే వారని గుర్తుచేసుకున్నారు. బడుగు బలహీన వర్గాలకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అండగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు వేల్పుల శౌరి, అధ్యక్షులు పాతకోటి స్టాలిన్ బాబు, కార్యదర్శి చింతా బుజ్జిబాబు, ఉపాధ్యక్షులు వేల్పుల సురేష్, జాయింట్ సెక్రటరీ రెడపంగు ప్రేమ్ కుమార్, కోశాధికారి పాతకోటి దుర్గా ప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు బొప్పన భవ కుమార్, టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పేద పిల్లలకు డిజిటల్ విద్యను అందించడమే నా కల

**రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ**



**నెల్లూరు, జూన్ 8 (జనస్వరం) :** నిరుపేదలు తమ బిడ్డలకు నాణ్యమైన విద్యను అందించే క్రమంలో వారు పడుతున్న ఇబ్బందులను దగ్గర్నుంచి చూశాను కాబట్టే.. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలని విఆర్ హైస్కూల్‌ని తీర్చిదిద్దుతున్నానని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. పేద పిల్లల కోసం సిద్ధమవుతున్న విఆర్ హైస్కూల్ను చూసేందుకు మంత్రితో పాటు పలువురు టీడీపీ మహిళలు వచ్చారు. ప్లేగ్రౌండ్‌లో ఉన్న ఎక్విప్మెంట్స్‌ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విఆర్ హైస్కూల్ రూపురేఖల్ని మంత్రి మార్చేశారంటూ అభినందనలు తెలిపారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన విఆర్ హైస్కూల్‌లో తన విద్యాభ్యాసం జరిగిందని గుర్తు చేసుకున్నారు. ఎంతోమందిని ఉన్నత శిఖరాలకు చేర్చిన విఆర్ హైస్కూల్‌ను గత ప్రభుత్వం మూసేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని మరో వారం రోజుల్లో అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. కుమార్తె షరిణి ఈ బాధ్యతలు చూసుకుంటున్నారని తెలిపారు. చదువులతోపాటు క్రీడలు కూడా విద్యార్థులకు చాలా అవసరమని అందుకే ప్లేగ్రౌండ్‌ని కూడా సుందరంగా తీర్చిదిద్దామని వివరించారు. తన కుమార్తె షరిణి 20 నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి కలెక్టర్ కార్తీక్, కార్పొరేషన్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, మాజీ జడ్పీటీసీ విజేతా రెడ్డి, డివిజన్ల ఇంచార్జులు, టీడీపీ మహిళలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అనుచిత వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**జనసేన నాయకుడు ఉప్పు వెంకటరత్తయ్య**



**గుంటూరు, జూన్ 8 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని వేశ్యలతో పోల్చిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య స్పందించారు. "ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది" అని ఆయన అన్నారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రస్తుత టీడీపీ అధ్యక్షుడు, సీఎం చంద్ర బాబు ముందుచూపుతో అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటించిన సందర్భాన్ని గుర్తుచేశారు. అమరావతి ఒక పవిత్ర పుణ్యక్షేత్రంగా ప్రజల మనస్సులో ఉందని, అలాంటి ప్రదేశాన్ని అభివ్యక్తి స్వేచ్ఛ పేరిట చులకనగా పేర్కొనడం బాధాకరమని పేర్కొన్నారు. "జర్నలిస్టుగా సమాజానికి మార్గదర్శకులై ఉండాల్సిన వారు, ఇలాంటి దుర్భాషలు ఉపయోగించడం క్షమించరాని విషయం" అని వెంకటరత్తయ్య విమర్శించారు. సమాజంలో మహిళలపై గౌరవం చూపించాల్సిన పరిస్థితుల్లో, వారి వ్యాఖ్యలు మహిళలను, సభ్య సమాజాన్ని గాయపరచేలా ఉన్నాయన్నారు. ఆయా వ్యాఖ్యలపై వారు మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే, పత్రికా స్వేచ్ఛ అనే పేరుతో ఇటువంటి వ్యక్తిగత దూషణలు చేయడం అసహనానికి గురిచేస్తోందని పేర్కొన్నారు. "ప్రజలకు అవసరమైన సమస్యలపై దృష్టి పెట్టకుండా, పరాయిచేయి వ్యాఖ్యలతో ప్రజలను దారితప్పించడం అగ్రహారణీయం," అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఘనంగా సి.కె. గ్రాండ్, అభి హెూటల్స్ ప్రారంభం

**పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ చేతుల మీదుగా ప్రారంభం**



**విజయవాడ, జూన్ 8 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** నగరంలోని 35వ డివిజన్ పరిధిలోని కరుణ హెూటల్ సెంటర్‌లో సి.కె. గ్రాండ్, అభి హెూటల్స్ నూతనంగా ప్రారంభమయ్యాయి. ఈ హెూటల్స్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని హెూటల్స్‌ను ఉత్సాహభరితంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర అభివృద్ధిలో యువత తీసుకుంటున్న వినూత్న ఆవిష్కరణలు, వ్యాపారాల్లో చేస్తున్న పురోగతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ 35వ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ రాజు పాల్గొని పార్లమెంట్ సభ్యునితో మర్యాదపూర్వకంగా కలసారు. అలాగే, టీడీపీ 35వ డివిజన్ అధ్యక్షురాలు నంద కుమారి, ఇతర ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. ప్రారంభోత్సవం అనంతరం అతిథులకు స్వాగతం పలికి, హెూటల్స్‌లో అందుబాటులో ఉండబోయే సేవలపై నిర్వాహకులు వివరించారు.

## ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డులో రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు

**రెడ్డి అప్పల నాయుడు చొరవ ఫలితం.. ప్రజల్లో హర్షం**




**ఏలూరు, జూన్ 8 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఏలూరు – జంగారెడ్డిగూడెం ప్రధాన రోడ్డులో రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాటుకు ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు చొరవ కారణమని స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. లునానీ నగర్, నేతాజీ నగర్, బీడీ కాలనీ వాసులు కొంతకాలంగా కాలనీల నుంచి మెయిన్ రోడ్డుకు రావడానికి తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో రెండు వారాల క్రితం ఆయా కాలనీల వాసులు రెడ్డి అప్పల నాయుడికి వినతిపత్రం అందజేశారు. వినతిని గమనించిన రెడ్డి అప్పల నాయుడు విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేసి తక్షణమే చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా, ఆదివారం లునానీ నగర్ వద్ద రిక్వెస్ట్ బస్ స్టాప్‌ను అధికారికంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, "ఇలాంటి ప్రజల సమస్యలకు స్పందించే నాయకులు ఏలూరులో ఉండటం అదృష్టం" అని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే బస్సు సౌకర్యం కల్పించడంతో ప్రయాణికులకు గణనీయమైన ఊరట లభించనుంది.

## మదనపల్లిలో 'శ్రీ శ్రీనివాస ఆటోమొబైల్స్' ప్రారంభం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న రాయలసీమ కోఆర్డినేటర్ దారం అనిత**



**మదనపల్లి, జూన్ 8 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** కదిరి రింగ్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ శ్రీనివాస ఆటోమొబైల్స్ షోరూమ్‌ను ఆదివారం ఉదయం శ్రీ శ్రీనివాసులు ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ దారం అనిత ముఖ్య అతిథిగా హాజరై ఆత్మీయంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దారం హరి, డాకరాజు, అలాగే టీవీఎస్ షోరూమ్ సురేష్, పలువురు జనసైనికులు పాల్గొన్నారు. నూతనంగా ప్రారంభమైన ఈ ఆటోమొబైల్ షోరూమ్ ద్వారా మదనపల్లి పరిధిలో ప్రజలకు మెరుగైన వాహన సేవలు అందుబాటులోకి రానున్నాయని నిర్వాహకులు తెలిపారు.

## అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి ఛానల్, ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలి

**వరికుంటపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**



**నెల్లూరు జూన్ 8 (జనస్వరం) :** అమరావతిపై, అక్కడ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి ఛానల్, ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టుపై చర్యలు తీసుకోవాలని వరికుంటపాడు మండలం పోలీస్ స్టేషన్‌లో మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్ రావు ఆధ్వర్యంలో గ్రామ కమిటీ అధ్యక్షులు పొద మాధవరావు, పి మాధవరావు సారథ్యంలో వరికుంటపాడు మహిళా మణులు ఎస్ఐ రఘునాథంకి ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో రెండు రోజుల క్రితం వనమహెూత్సవం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు అమరావతిని దేవతల రాజధానిగా వ్యాఖ్యానించారు. దీనిని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు, సాక్షి ఛానల్ కౌంటర్‌గా డిబేట్‌ను ఏర్పాటు చేసింది. ఈ చర్చలో పాల్గొన్న సాక్షి ప్రతినిధి కొమ్మినేనీ శ్రీనివాసరావు, కృష్ణంరాజు అనే సీనియర్ జర్నలిస్ట్ అమరావతి దేవతల రాజధాని కాదు అది వేశ్యల రాజధాని అని వక్రీకరించారు. అంతేకాకుండా ఎయిడ్స్ పేషెంట్లు ఉన్న ప్రాంతం అమరావతి అని వ్యాఖ్యానించారు. ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి ఛానల్ యాజమాన్యం మీద ఏ1గా ఇటువంటి చర్చను కొనసాగించిన కొమ్మినేనీ శ్రీనివాసరావును ఏ2గా ప్రోత్సహించి మాట్లాడిన జర్నలిస్ట్ కృష్ణంరాజుని ఏ3గా కేసు నమోదు చేసి వీరందరిపై, సహకరించిన కొంతమందిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మహిళలపై అసభ్య పదజాలంతో మాట్లాడిన వారిపై పరువు నష్టం దావా వేసేందుకు కూడా వెనుకాడేది లేదని మహిళలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యమ్మ శాంతికుమారి నల్లగోండ్ల వెంగళరావు, రవి, బాలచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్థ సేవకు నిదర్శనం ఆచార్య ఎన్.జి.రంగా..

# ఆయన చరిత్ర ఒక స్ఫూర్తి

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- ఆచార్య రంగా నగర్ లో ఆచార్య ఎన్.జి రంగా విగ్రహావిష్కరణ
- విగ్రహావిష్కరణ చేసిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్
- ఆచార్య ఎన్.జి రంగా వర్ధంతి సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే ఘన నివాళి
- ఆచార్య రంగా నగర్‌లో రూ.37 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు
- రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దెరామమోహన్



**విజయవాడ, జూన్ 8 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** "నిస్వార్థ సేవలకు ఆచార్య ఎన్జీరంగా నిదర్శనం. ఆయన చరిత్ర రాజకీయ నాయకులకు మాత్రమే కాదు నేటి యువతరానికి ఒక స్ఫూర్తి" అంటూ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కొనియాడారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 8వ డివిజన్‌లో ఆచార్య రంగా నగర్ లోని పార్క్ వద్ద ఆచార్య ఎన్జీ రంగా కాంస్య విగ్రహాన్ని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కలిసి ఆవిష్కరించారు. అంతకంటే ముందు డివిజన్‌లో సుమారు రూ.37 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీ, ఎమ్మెల్యే కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగా వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. తాను పుట్టి పెరిగింది అంతా ఆచార్య రంగా నగర్‌లోనే తన బాల్యం ఇక్కడే గడిచిందని గుర్తు చేసుకున్నారు. తాను వ్యాపారాలను ప్రారంభించింది కూడా ఈ ప్రాంతం నుంచేనని చెప్పారు. తన తాత కేశినేని వెంకయ్య ఎన్జీ రంగాకు ప్రధమ శిష్యుడని అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా తో కలిసి అనేకసార్లు కేశినేని వెంకయ్య సమావేశాలు నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. ఎక్కువ సార్లు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై గిన్నిస్ బుక్ లో రికార్డు నమోదు ఏకైక వ్యక్తి ఆచార్య రంగా అని అన్నారు. తెలుగువారి హృదయాల్లో ఎన్టీఆర్, ఆచార్య రంగా వంటి వారు చిరస్థాయిగా నిలిచి ఉంటారని అన్నారు. చరిత్ర కొంతమందిని మర్చిపోతుందేమో కానీ ఎన్జీరంగా, ఎన్టీఆర్ వంటి వారిని చరిత్ర ఎప్పటికీ మర్చిపోదని చెప్పారు. ఆచార్య ఎన్జీ రంగా మాదిరిగానే తనకు, గద్దె రామమోహన్‌కు ఎంపీగా అవకాశం రావడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగా విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. తన చిన్నతనం నుంచి ఆయన పేరు వింటూనే ఉన్నానని చెప్పారు. విమానాలు లేని సమయంలో 1921వ సంవత్సరంలోనే ఆయన ఓడల్లో అమెరికాకు వెళ్ళి చదువుకున్నారంటే ఆయన చదువుకు ఇచ్చిన ప్రాధాన్యతను తెలియజేస్తుందన్నారు. అందుకే ఆయనను ఆచార్య అంటారని చెప్పారు. రాష్ట్రపతి ఆర్.వెంకట్రామన్, సర్ధార్ గౌతు లచ్చన్నలకు ఆచార్య రంగా గురువు అని చెప్పారు. ఆచార్య రంగా శిష్యులమని చాలా మంది ఇప్పటికీ గర్వంగా చెప్పుకుంటారన్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న అనేకమంది నాయకులు ఎన్జీ రంగా శిష్యులేనని చెప్పారు. ఆయనకు ఉన్నంత మంది శిష్యులు రాజకీయాల్లో మరెవ్వరికి లేరని చెప్పారు. ఆయన చరిత్రను ప్రతి ఒక్కరూ తెల్సుకుని స్ఫూర్తి పొందాలన్నారు. ఆచార్య ఎన్జీ రంగా చరిత్రను పాఠ్యంశాల్లో చేర్చడం ద్వారా విద్యార్థులు ఎంతో స్ఫూర్తిని పొందుతారన్నారు. ఆచార్య రంగా సోదరి పుష్ప కుమారి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగా విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వాహినీ పత్రికను కూడా ఆచార్య ఎన్జీరంగా ఇక్కడ నుంచే నిర్వహించేవారని చెప్పారు. స్థానికంగా ఉన్న చాలా మంది రంగాకు అండగా ఉండి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. రైతుల వాయిస్‌ను వాహిని పత్రిక ద్వారా ప్రభుత్వానికి తెలియజేసేవారని చెప్పారు. 8వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, శాలివాహన కుమ్మరి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, మాజీ కార్పొరేటర్ ఎరుబోతు రమణ, టిడిపి నాయకులుకోగంటి రామారావు, యెర్నేని వేదవ్యాస్, కొత్తపల్లి రమేష్, కృపారావు, సురేష్, గద్దె రంగారావు, భవానీ, ఆచార్య రంగా నగర్ కాలనీ వాసులు లింగం కృష్ణ శంకర్, అట్లూరి శ్రీనివాస్, బోయపాటి రామచంద్రరావు, అక్కినేని ప్రభాకర్ రావు, భారతిదేవి, లక్ష్మి శ్రియ, ఫణి రాజు ఆచార్య ఎన్.జి.రంగా కుటుంబ సభ్యులతో పాటు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయవాడలో ఆచార్య ఎన్.జి.రంగా వర్ధంతి

### కాకాని ఆసయ సాధన సమితి, ఎన్.జి.రంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో నివాళులు



**విజయవాడ, జూన్ 8 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమ నాయకుడు ఆచార్య ఎన్.జి.రంగా వర్ధంతిని ఎన్.జి.రంగా ట్రస్ట్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎం.జి.రోడ్‌లోని కంట్రోల్ రూమ్ సెంటర్ వద్ద ఉన్న ఎన్.జి. రంగా విగ్రహానికి పూలమాలలర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి కాకాని ఆసయ సాధన సమితి చైర్మన్ డా. కాకాని తరుణ్, ఎన్.జి.రంగా ట్రస్ట్ చైర్మన్ గోగినేని ధనశేఖర్, కార్యదర్శి రవి, సభ్యులు భాను, నిఖిల్, కె. బసవ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. తరుణ్ కాకాని మాట్లాడుతూ, "స్వాతంత్ర్య సమరయోధులు ఎన్.జి.రంగా, కాకాని వెంకటరత్నం వంటి మహనీయుల సేవలను నేటి తరానికి పరిచయం చేయడం మనందరి బాధ్యత" అన్నారు. ఎన్.జి.రంగా మూడు దశాబ్దాల పాటు పార్లమెంటు సభ్యుడిగా రైతుల హక్కుల కోసం పోరాడారని, అలాగే కాకాని వెంకటరత్నం వ్యవసాయం, పాడి పరిశ్రమ శాఖ మంత్రిగా వ్యవసాయ సమాజ అభ్యున్నతికి కృషి చేశారని గుర్తుచేశారు. వారు 1900లో వరుసగా గుంటూరు, కృష్ణా జిల్లాల్లో జన్మించి, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించినట్టు తెలిపారు. గుంటూరులోని అంగ్రా వ్యవసాయ విశ్వవిద్యాలయంకు ఎన్.జి.రంగా పేరు పెట్టడమేగాక, విజయవాడలోని వైద్య కళాశాలకు మొదట కాకాని వెంకటరత్నం పేరు పెట్టిందని, అది తర్వాత ఎన్.టి.ఆర్ విశ్వవిద్యాలయంగా మారిందని వివరించారు. "స్వాతంత్ర్య సమరయోధుల ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లే హక్కు వారిని అనుసరించే వారికే ఉంటుంది. అది పుట్టుకతో వచ్చే ఋణం కాదు, ధర్మబద్ధతతో సంపాదించేది" అని డా. తరుణ్ కాకాని స్పష్టం చేశారు. ఎన్.జి.రంగా వర్ధంతిని జరుపుకోవడం తమకు గర్వకారణమని ట్రస్ట్ చైర్మన్ గోగినేని ధనశేఖర్ తెలిపారు. ప్రజా నాయకుల సేవలను గుర్తుచేస్తూ ఈ తరానికి అందించాలన్న సంకల్పంతో కాకాని ఆసయ సాధన సమితి చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.

## సర్వేపల్లిలో పర్యావరణ పరిరక్షణకు ముందడుగు

### 20 మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించిన బొబ్బేపల్లి కుటుంబం




**సర్వేపల్లి, జూన్ 8 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు తన కుటుంబం తరపున 20 మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాట్లాడుతూ "వృక్షో రక్షతి రక్షితః" అన్న వాక్యం ఎంత సత్యమో మనందరికీ తెలుసని, ప్రతి కుటుంబం కనీసం నాలుగు మొక్కలను నాటి వాటిని పెంచాలని పిలుపునిచ్చారు. "మంచి నీటిని తాగడానికీ ఇప్పుడు డబ్బు పెట్టి కొనుగోలు చేస్తున్న పరిస్థితిలో ఉన్నాం. మొక్కలను ఇప్పుడు నాటకపోతే రాబోయే తరాలు మంచి గాలికీ డబ్బు పెట్టాల్సిన దుస్థితి ఎదురవుతుంది" అంటూ యువతను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా బొబ్బేపల్లి రమణయ్య 20 మొక్కలను నాటి, వాటిని పూర్తిగా సంరక్షించేందుకు ముందుకు రావడం విశేషం. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు, పినిశెట్టి మల్లికార్జున్, జనసేన ఐటీ వింగ్ నాయకుడు పసుపులేటి ప్రసాద్, సందూరి శ్రీహరి, చెంచయ్య, మణి, ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం, అశోక్, సుమన్, మల్లి తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ కూటమి పిలుపు మేరకు ప్రతి కుటుంబం తమ వంతుగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం సమాజానికి గొప్ప సేవగా అభివర్ణించబడుతోంది.

## ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎర్రా రామారావుకి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నివాళి



**విజయవాడ, జూన్ 8 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** పశ్చిమ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కీర్తిశేషులు ఎర్రారామారావు చిత్ర పటానికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఘన నివాళులర్పించారు. ఎర్రా రామారావు దశదిన కార్యక్రమం ఆదివారం చిట్టినగర్‌లోని మిల్క్ ఫ్యాక్టరీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సోలంకి రాజు తో కలిసి పాల్గొన్నారు. ముందుగా ఎర్రా రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎర్రా రామారావు కుటుంబ సభ్యులకి ఎంపీ కేశినేని శివనాథ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎర్రా రామారావు టిడిపి కోసం చేసిన సేవలను కొనియాడారు. టిడిపి ఎర్రా రామారావు ను ఎన్నటికీ మర్చిపోదని, ఆయన కుటుంబానికి పార్టీతో పాటు తాను అండగా వుంటానని భరోసా కల్పించారు. ఎర్రా రామారావు ఆత్మకి శాంతి కలగాలని భగవంతుడ్ని ప్రార్థించారు. ఈకార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వాసం మునియ్య, పశ్చిమ నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు నమ్మి భాను ప్రకాష్, పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు సుఖాసి సరిత, పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, పశ్చిమ నియోజకవర్గ నాయకులు బుదాల నందకుమారి, సంతోష్, అజీద్, సారేపల్లి రాధకృష్ణ, నాగోతి రామారావు, గుర్రం కొండ, కత్తి డెవిడ్, కుప్పుల గంగాధర రెడ్డి, జాహీద్, ఎస్.కె.అన్సార్, ముదిరాజ్ శివాజీ, తాజుద్దీన్, డి.ప్రభుదాస్ లతో తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారస్తులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- పూర్ణానంద పేటలో సి. కె. గ్రాండ్ అండ్ హెూటల్ అభి ప్రారంభోత్సవం
- ముఖ్యఅతిథిగా హాజరై హెూటల్ ను ప్రారంభించిన ఎంపీ



**విజయవాడ, జూన్ 8 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** గత ప్రభుత్వంలో వ్యాపారస్తులు వ్యాపారం చేయటానికి భయపడే పరిస్థితి వుండేది.. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో వ్యాపారస్తులు ధైర్యంగా వ్యాపారం చేయడానికి ముందడుగు వేస్తున్నారు. రాష్ట్రం అభివృద్ధి పథం వైపు పయనిస్తుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో పూర్ణానంద పేట రైల్వే హాస్పిటల్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన సి. కె. గ్రాండ్ అండ్ హెూటల్ అభిను ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కేశినేని శివ నాథ్ ప్రారంభించారు. హెూటల్ రంగంలో సి. కె. గ్రాండ్ అండ్ హెూటల్ అభి బాగా వృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ హెూటల్ ఓనర్ పవన్ కుమార్‌కు ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ ఎరుబోతు రమణ, డివిజన్ అధ్యక్షులు బుదాలి నంద కుమారి, ఎ. కొండా, మధుసూదన్ రావు, ఎమ్. డి. జాహీద్, మాజీ కార్పొరేట్ సుభాషిణి, టిడిపి నాయకులు గంగాధర్ రెడ్డి, ఎస్.డి అన్సర్, రాజు, ఇమ్రాన్, పెరుమాళ్లు, పీతా బుజ్జి, మోహనరావు, రాఘవేంద్ర, దాసు, కొట్టేటి సరిత లతోపాటు ఎన్డీయే కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గైడ్స్ శిక్షణలో పాల్గొన్న బాలికలను అభినందించిన జనసేన నేత యల్లటూరు శ్రీనివాస రాజు



**రాజంపేట, జూన్ 8 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఉమ్మడి కడప జిల్లా రాజంపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్‌లో అన్నమయ్య జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న గైడ్స్ తృతీయ సోపాన్, టెస్టింగ్ క్యాంప్‌లో శిక్షణ పొందుతున్న బాలికలను స్థానిక పార్లమెంటు జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాస రాజు ఆదివారం సందర్శించి అభినందించారు. ఈ శిక్షణ శిబిరంలో మూడవ రోజు సందర్భంగా ఉపాధ్యాయుల ఆహ్వానంతో హాజరైన శ్రీనివాస రాజు, శిక్షణలో పాల్గొంటున్న 107 మంది బాలికల వసతి, భద్రత, అవసరాలపై ప్రత్యేకంగా విచారణ చేపట్టి పరిస్థితులను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ శిక్షణ మీ జీవితంలో ఒక గొప్ప ఆధారశిల. మీరు బలమైన మహిళలుగా ఎదగాలి. దేశం మీపై గర్వపడేలా మీరు మెరుగైన మార్గంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు. ఇంకా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గైడ్స్ సభ్యుల కోసం 0.5 శాతం రిజర్వేషన్ కల్పించిన విషయాన్ని గుర్తుచేసి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావకాశాలు పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, విశ్రాంత పోలీస్ అధికారి కడిమెళ్ళ శ్రీనివాసరాజు, లక్ష్మీ నరసయ్య, పివిఆర్ కుమార్, బుజ్జి బాబు, శివశంకర్ రాజు, ఉపాధ్యాయులు శేషారెడ్డి, లక్ష్మీకర్, వీరయ్య, సారా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీచ్ కబడ్డీ పురుషుల ఛాంపియన్ ఆంధ్రప్రదేశ్

- బీచ్ కబడ్డీ మహిళల ఛాంపియన్ హర్యానా
- బీచ్ వాలీబాల్ పురుషుల ఛాంపియన్ విజయనగరం
- బీచ్ వాలీబాల్ మహిళల ఛాంపియన్ గుంటూరు
- ముగిసిన మసుల బీచ్ ఫెస్ట్ 2025



**మచిలీపట్నం, జూన్ 8 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** 13వ జాతీయస్థాయి బీచ్ కబడ్డీ పురుషుల విభాగం ఫైనల్స్ లో రాజస్థాన్ పై ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించి ఛాంపియన్ గా నిలిచింది. మహిళల విభాగంలో హర్యానా, హిమాచల్ ప్రదేశ్ జట్లు ఫైనల్స్ లో తలపడగా హర్యానా ఛాంపియన్ గా నిలిచింది. పురుషుల విభాగంలో రాజస్థాన్ ద్వితీయ స్థానం, ఉత్తరఖండ్, హర్యానా సంయుక్తంగా తృతీయ స్థానం దక్కించుకోగా మహిళల విభాగంలో హిమాచల్ ప్రదేశ్ ద్వితీయ స్థానం, ఉత్తరప్రదేశ్, పంజాబ్ సంయుక్తంగా తృతీయ స్థానం సాధించాయి. గత నాలుగు రోజులుగా మచిలీపట్నం మంగినపూడి బీచ్ లో జరుగుతున్న మసుల బీచ్ ఫెస్ట్ ఆదివారంతో ముగిసింది. ఈ బీచ్ ఫెస్ట్ లో భాగంగా జాతీయస్థాయి సీ కానోయింగ్ ఛాంపియన్ షిప్, జాతీయస్థాయి బీచ్ కబడ్డీ ఛాంపియన్ షిప్, ఆహ్వానపు బీచ్ వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఆదివారం జరిగిన వాలీబాల్ ఫైనల్స్ లో పురుషుల విభాగంలో కృష్ణాజిల్లాపై 2-0 తేడాతో విజయనగరం జట్టు విజయం సాధించి ఛాంపియన్ గా నిలిచింది. విశాఖపట్నం జట్టు తృతీయస్థానం దక్కించుకుంది. మహిళల విభాగం లీగ్ పద్దతిలో జరుగగా గుంటూరు ప్రధమ, విశాఖపట్నం ద్వితీయ, కృష్ణాజిల్లా జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకున్నాయి.